

నేటి దర్శిని తెలుగు దిన పత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు.
సెల్ : 94920 33365




# నేటి దర్శిని
WWW.NETIDARSHINI.COM
PRGI NO: APTEL/26/A5450
తెలుగు దిన పత్రిక
సత్య శోధనే మా లక్ష్యం...



రిపోర్టర్లు కావలెను
జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి
నేటి దర్శిని ఆహ్వానం పలుకుతుంది.
తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ,
మండల స్థాయిలో రిపోర్టర్లుగా
పని చేయుటకు ఆసక్తి, అనుభవం
ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్
చేసి సంప్రదించగలరు.
Contact Number
9059328777



విజయవాడ శుక్రవారం 18-09-2026 సంపుటి: 02 సంచిక : 78 వెల: 2 రూ పేజీలు :04 సంపాదకులు: కట్ట హిమ పావని
Vijayawada Friday, 18-09-2026 Volume :02 Issue: 78 RS: 2 Pages:04 Editor : Katta HimaPavani

# అభిషేక్ అదరహో

- 30 బంతుల్లోనే శతకబాదిన శర్మ
- 127 పరుగులతో భారత్ ఘన విజయం
- 3-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్
- భారత్ 221/7, అఫ్గనిస్తాన్ 94/10

02

30 బంతుల్లోనే శతకం బాదిన అభిషేక్ శర్మ అఫ్గాన్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. 34 బంతుల్లో 108 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడడంతో భారత్ 221/7 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం భారత బౌలర్లు చెలరేగడంతో అఫ్గనిస్తాన్ 94 పరుగులకే ఆలౌటైంది. 127 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించిన భారత్.. మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది.



02

# జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

- జిన్‌పింగ్ ఆరోగ్యంపై వాంజున్ షీ సంచలన పోస్టు
- బ్రిక్స్ సదస్సులో స్వల్ప బ్రెయిన్‌స్ట్రోక్ వచ్చిందన్న ప్రచారం
- స్పృహ కోల్పోయిన జిన్‌పింగ్‌ను చైనాకు తరలించారన్న వాదన
- ఆర్మీ ఆసుపత్రిలో రహస్యంగా చికిత్స అందిస్తున్నారన్న ఆరోపణ
- మోదీ ప్రసంగం వేళ జిన్‌పింగ్ తూలినట్టు కనిపించడంతో చర్చ
- జిన్‌పింగ్ ఆరోగ్యంపై మోదీ ఆరా తీసినట్టు సమాచారం
- మోదీ ఇచ్చిన విందుకు హాజరుకాకుండానే చైనాకు పయనం
- జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితిపై అధికారిక స్పష్టత కరవు

# సుస్థిరతతోనే పెట్టుబడులు!

## మోదీ.. సరైన సమయంలో సరైన నాయకుడు

- 25 ఏళ్లుగా ప్రభుత్వాధినేతగా ఉండడం మామూలు విషయం కాదు..
- దేశాన్ని ప్రగతి దిశగా నడుపుతున్నారు
- జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్నారు
- మేకిన్ ఇండియాను బలోపేతం చేశారు
- -నదుల అనుసంధానం ఆయనతోనే సాధ్యం
- మహిళలకు 33శాతం కోటా.. గేమ్ చేంజర్
- ఏపీకి కేంద్రం నుంచి పెద్దఎత్తున సహకారం
- వారాణసీ-వడ్‌నగర్ సేవా అభియాన్‌లో సీఎం
- అవి వస్తే ఉపాధి, అభివృద్ధి: చంద్రబాబు

గతంలో యువత ఉద్యోగాల మీదే ఆధారపడేది. అయితే ప్రధాని మోదీ దూరదృష్టి కారణంగా 2.20 లక్షల స్టార్టప్‌ల ద్వారా యువతే ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదిగింది. ఇప్పుడు అద్భుతమైన స్టార్టప్ ఎకో సిస్టం కలిగిన దేశాల్లో భారత్ మూడో స్థానంలో ఉంది.25 ఏళ్ల పాటు నిరంతరాయంగా ప్రభుత్వాధినేతగా ఉండడం మామూలు విషయం కాదు. మోదీ సమాజాన్ని చదివారు.. దానికనుగుణంగా పాలన చేపట్టారు. 2003లో గుజరాత్ సీఎంగా ఉండగా 'వైబ్రంట్ గుజరాత్' కార్యక్రమం నిర్వహించారు.. ఇప్పుడది గ్లోబల్ బ్రాండ్‌గా మారింది.




అమరావతి,

'సుస్థిరతతో నమ్మకం పెరుగుతుంది. నమ్మకంతో పెట్టుబడులు వస్తాయి. పెట్టుబడుల వల్ల ఉద్యోగాలు సమకూరుతాయి. అభివృద్ధి జరుగుతుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రధాని మోదీని దేశానికి సరైన సమయంలో సరైన నాయకుడిగా అభివర్ణించారు. మోదీ పాతికేళ్ల ప్రజాప్రస్థానాన్ని పురస్కరించుకుని గురువారం వారాణసీలోని రుద్రాక్ష్ కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహించిన 'వారాణసీ-వడ్‌నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు.దేశాన్ని మోదీ అభివృద్ధి దిశగా నడిపిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసం కాకుండా జాతి ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ఆయనకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని తన ప్రసంగంలో పిలుపిచ్చారు. -మిగతా 2 లో




# పోలీస్ పరీక్షకు డేట్ ఫిక్స్

- నవంబర్ 28న ఎస్ఐ రాత పరీక్ష
- డిసెంబర్ 20న పీసి తత్సమాన పోస్టులకు పరీక్ష
- వయస్సు సడలింపుతో 1.13 లక్షల మందికి లబ్ధి
- 1,46,220 మహిళా అభ్యర్థుల దరఖాస్తు
- దరఖాస్తు దారుల్లో 4,30,844 పురుషులు
- మొత్తం 7,437 పోస్టులకు 5,77,064 దరఖాస్తులు

హైదరాబాద్,

తెలంగాణలో పోలీసు ఉద్యోగాల భర్తీకి సంబంధించి బోర్డు ఛైర్మన్ వివి శ్రీనివాసరావు గురువారం ప్రిలిమినరీ రాత పరీక్షల తేదీల వివరాలను అధికారికంగా విడుదల చేశారు. నవంబర్ 28న ఎస్ఐ, తత్సమాన పోస్టులకు సంబంధించి ప్రిలిమినరీ రాత పరీక్ష, డిసెంబర్ 20న కానిస్టేబుల్ తత్సమాన పోస్టుల రాత పరీక్షను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాల కేంద్రాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయని, పరీక్షల తేదీలను దృష్టిలో ఉంచుకుని తమ ప్రిపరేషన్ ను వేగవంతం చేయాలని సూచించారు. రాష్ట్రంలో మొత్తం 7,437 ఖాళీల భర్తీ కోసం జులై 29న నోటిఫికేషన్లు విడుదల చేశామని, ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు ఆన్ లైన్ దరఖాస్తుల ప్రక్రియ విజయవంతంగా -మిగతా 2 లో



02


# నో ఇన్సూరెన్స్.. నో ఫ్యూయల్!

- ఢిల్లీలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు
- ఐఆర్‌డీఏఐ ఆధ్వర్యంలో ఏఎన్‌పీఆర్ వ్యవస్థకు శ్రీకారం
- ఐఐబీ, 'వాహన్' రికార్డులతో వాహన నంబర్ల సరిపోలింపు
- థర్డ్ పార్టీ బీమా ఉందో లేదో ఆటోమేటిక్‌గా తనిఖీ
- బీమా లేని వాహనాలకు పెట్రోల్, డీజిల్ విక్రయాల నిరాకరణకు అవకాశం
- సుప్రీంకోర్టు ప్రతిపాదించిన విధానం అమలుకు చర్యలు
- ప్రయోగం విజయవంతమైతే ఇతర ప్రాంతాలకు విస్తరించే అవకాశం
- బీమా లేని వాహనాలను బీమా పరిధిలోకి తెచ్చే లక్ష్యం

# బ్రిక్స్ సదస్సుపై పాక్--ఐఎస్ఐ ఉగ్ర కుట్ర

- బ్రిక్స్ సదస్సును భగ్నం చేయాలనుకున్న పాక్, ఐఎస్ఐ..
- ఐఎస్ఐ ఆధ్వర్యంలో చొరబాటు యత్నం
- హీరానగర్ నుంచి ఉగ్రవాదుల చొరబాటుకు ప్లాన్
- బోబియా ప్రాంతంలో చొరబాటు స్థావరాల ఎంపిక
- సదస్సు వేళ భారీ దాడికి కుట్ర
- ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులే టార్గెట్
- ముందే పసిగట్టిన భద్రతా బలగాలు
- అప్రమత్తతతో తప్పిన పెను ఉగ్ర ముప్పు

02




# ఇకపై మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి!

- కేంద్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదన
- మెడికల్ షాపుల్లో ప్రిస్క్రిప్షన్ మందుల విక్రయాలపై నిఘా
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ప్రకారమే మందులు విక్రయించేలా పర్యవేక్షణ
- డ్రగ్స్ రూల్స్--1945లోని రూల్ 65కు సవరణల ప్రతిపాదన
- సీసీటీవీ రికార్డులను కనీసం మూడు నెలలు భద్రపరచాలి
- మందుల సరఫరా, రవాణా కూడా ప్రిస్క్రిప్షన్ ప్రకారమే
- కొత్త నిబంధనలపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరణ



02



# తెలంగాణకు భారీ వర్ష సూచన

- ఐదు రోజుల పాటు దంచికొట్టనున్న వానలు
- హైదరాబాద్ సహా పలు జిల్లాలకు ఐఎండీ ఎల్లో అలర్ట్ జారీ
- ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు
- ఈ సీజన్లో రాష్ట్రంలో ఇప్పటికీ 19 శాతం వర్షపాతం లోటు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

హైదరాబాద్,

తెలంగాణలో రుతుపవనాలు మళ్లీ చురుగ్గా మారాయి. రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. శనివారం (19వ తేదీ) నుంచి వర్షాల తీవ్రత పెరగనుందని తెలిపింది. గురు, శుక్రవారాల్లో కూడా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు ఈదురు గాలులతో కూడిన -మిగతా 2 లో

# ఎల్‌నినోపై ముందస్తు చర్యలేవీ?




## పోలవరం ప్రాజెక్టు సామర్థ్యంపై కూటమి రాజీపడిందని జగన్ ఆరోపణ

- నిజానికి 'తొలి దశ' విన్యాసాలు చేసింది ఆయనే
- 119 టీఎంసీలకే పరిమితం చేస్తే బ్యారేజీగా మారుతుందని హెచ్చరించినా వినలేదు
- టీ-ప్రాజెక్టులపై కేసీఆర్‌ను ఏనాడూ అడగలేదు
- పైగా ఇచ్చిపుచ్చుకోవాలంటూ సుద్దులు
- తన హయాంలో కరువు మండలాలే ప్రకటించలేదు

అమరావతి,

అధికారంలో ఉన్నప్పుడు ఒకలా.. గద్దెదిగాక మరోలా వ్యవహరించడం వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు అలవాటుగా మారిపోయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం ఆయన తాడేపల్లి ప్యాలెస్ నుంచి వైసీపీ ప్రధాన కార్యదర్శులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, జిల్లా అధ్యక్షులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం ఉంటుందని తెలిసినప్పటికీ సీఎం చంద్రబాబు ముందస్తు -మిగతా 2 లో


02

# రష్యా చమురు కొనవద్దని అమెరికా అల్టిమేటం..

- రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా వార్నింగ్
- తీవ్రంగా స్పందించిన భారత్..!
- భారత్, చైనాలకు 100 శాతం సుంకాల ముప్పు
- ఆంక్షల బిల్లుకు అమెరికా సభ గ్రీన్‌సిగ్నల్
- ట్రంప్ సంతకం కోసం బిల్లు సిద్ధం
- ఇంధన భద్రతపై భారత్ స్పష్టత
- మార్కెట్ పరిస్థితుల మేరకే చమురు కొనుగోళ్లు
- అమెరికా చర్యలపై న్యూఢిల్లీ అసంతృప్తి
- వాణిజ్య ప్రయోజనాలు కాపాడుకుంటాం

# పోలీస్ పరీక్షకు డేట్ ఫిక్స్

మొదటి తరువాయి

ముగిసినట్లు తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వం వయస్సు సడలింపు ఇవ్వడంతో దాదాపు 1.13 లక్షల మంది అభ్యర్థులకు లబ్ధి చేకూరిందని మొత్తం 4,29,000 మంది అభ్యర్థులు 5,77,064 దరఖాస్తులను సమర్పించారని వివరించారు. 68 శాతానికి పైగా అభ్యర్థులు కేవలం ఒక్క పోస్టుకే దరఖాస్తు చేసుకున్నారని, దరఖాస్తు చేసిన వారిలో పురుషులు 74 శాతానికి పైగా ఉండగా, మహిళా అభ్యర్థులు 25 శాతానికి పైగా ఉన్నారని తెలిపారు.


97 శాత అథెంటికేషన్ పూర్తి

పోలీసు ఉద్యోగాలకు కేటగిరీల వారీగా పరిశీలిస్తే బీసీ అభ్యర్థులు దాదాపు 49 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 43 శాతానికి పైగా దరఖాస్తు చేసుకున్నారు. మొదటిసారిగా ప్రవేశపెట్టిన ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ను 97 శాతానికి పైగా అభ్యర్థులు విజయవంతంగా పూర్తి చేశారు. ఇంకా పూర్తి చేయని వారు ఈ నెల 30లోగా తమ లాగిన్ ద్వారా దీన్ని పూర్తి చేసి పీడీఎఫ్ ఫారామును డౌన్లోడ్ చేసుకోవచ్చని బోర్డు తెలిపింది. మొత్తం 7,437 పోస్టులకు 5,77,064 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఎస్పైటీ ఎస్ఐ సివిల్, తత్సమాన పోస్టులకు సంబంధించి 1,60,756 దరఖాస్తులు రాగా, ఎస్పైటీ కానిస్టేబుల్ సివిల్, తత్సమాన పోస్టులకు 3,89,356 మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్షలను ఉమ్మడి పది జిల్లాలతో పాటు 15, 18 ప్రాంతాల్లో పరీక్ష నిర్వహించనున్నామని, ఎస్ఐ ఎఆర్ పీటీ, డ్రైవర్, మెకానిక్ పోస్టులకు తొలుత పిఎంటీ, పిఈటీ పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు స్పష్టం చేసింది. ఈ ఏడాది జులై 29న జారీ చేసిన నాలుగు నోటిఫికేషన్ల ద్వారా వివిధ విభాగాల్లో మొత్తం 7,437 ఖాళీలను భర్తీ చేయడంలో ప్రభుత్వం కల్పించిన వయోపరిమితి సడలింపుతో సుమారు 1.13 లక్షల మంది అభ్యర్థులకు లబ్ధి చేకూరింది.

తెలుగును ఖరారు చేసిన ఎక్కువ మంది అభ్యర్థులు

పోలీసు పరీక్షలకు సంబంధించి మాధ్యమం విషయానికి వస్తే 56.84 శాతం మంది తెలుగును, 43.02 శాతం మంది ఇంగ్లీష్ ను, 0.12 శాతం మంది ఉర్దూను ఎంచుకున్నారు. నియామక ప్రక్రియలో తొలిసారిగా ప్రవేశపెట్టిన ఆధార్ ఫేస్ అథెంటికేషన్ ను 97.4 శాతం మంది అభ్యర్థులు మొబైల్ యాప్ ద్వారా విజయవంతంగా పూర్తి చేసుకున్నారని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల పూర్తి చేయని మిగిలిన 2.6 శాతం మంది అభ్యర్థులు సెప్టెంబర్ 30 వరకు తమ లాగిన్ ఏరియాలో ఈ ప్రక్రియను పూర్తి చేసి పీడీఎఫ్ అప్లికేషన్ ను డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు.

# జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?




బీజింగ్

చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితిపై సర్వత్రా ఆందోళన మొదలైంది. ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిందంటూ ప్రచారం జరుగుతున్నది. చైనా డెమోక్రటిక్ పార్టీ చైర్మన్ వాంజున్ షీ చేసిన పోస్టుతోనే ఈ ప్రచారం ఊపందుకుంది. 'బ్రిక్స్ సదస్సులో జిన్‌పింగ్‌కు స్వల్పంగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. స్పృహ కోల్పోయిన జిన్‌పింగ్‌ను వెంటనే విమానంలో చైనాకు తీసుకొచ్చారు. స్వాగత ఏర్పాట్లు లేకుండా రహస్యంగా హెలికాప్టర్‌లో ఆర్మీ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇండియాలో అయితే అందరికీ తెలుస్తుందని.. అక్కడ ప్రథమ చికిత్స చేసి తీసుకొచ్చారు. ప్రస్తుతం జిన్‌పింగ్ ఆరోగ్య పరిస్థితి ఏంటో తెలియదు' అని వాంజున్ పోస్టులో తెలిపారు. బ్రిక్స్ సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతుండగా జిన్‌పింగ్ తూలినట్టు కనిపించారు. దీంతో మోదీ ప్రసంగం ఆపి.. అంతా బాగానే ఉందా అని అడిగినట్టు సమాచారం. మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ హాజరు కాకుండానే చైనా వెళ్లిపోయారు. అప్పటి నుంచే అనుమానాలు పెరుగుతున్నాయి.

# నో ఇన్సూరెన్స్.. నో ఫ్యూయల్!




**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17**

సుప్రీంకోర్టు ప్రతిపాదించిన బీమా లేకపోతే ఇంధనం లేదు విధానాన్ని అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో వాహన రిజిస్ట్రేషన్ నంబర్లను ఇన్సూరెన్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో(ఐఐబీ), 'వాహన్' రికార్డులతో సరిపోల్చే ఆటోమేటెడ్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్(ఏఎన్‌పీఆర్) వ్యవస్థను ప్రయోగాత్మకంగా అమలు చేయడానికి ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఐఆర్‌డీఏఐ) సిద్ధమవుతున్నది. ప్రతిపాదిత విధానం అమల్లోకి వస్తే చెల్లుబాటు అయ్యే థర్డ్-పార్టీ మోటార్ ఇన్సూరెన్స్ లేని వాహనాలకు పెట్రోల్ లేదా డీజిల్ అమ్మడాన్ని ఇంధన కేంద్రాలు(పెట్రోల్ పంపులు) నిరాకరించే అవకాశం ఉంటుంది. ఈ ప్రయోగాత్మక కార్యక్రమం విజయవంతమైతే సాధారణ బీమా సంస్థలకు ఇది బీమా లేని భారీ సంఖ్యలో వాహనాలను అధికారిక బీమా పరిధిలోకి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తుంది.

# బ్రిక్స్ సదస్సుపై పాక్-- ఐఎస్ఐ ఉగ్ర కుట్ర





న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17

ఇండియా ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన బ్రిక్స్ సదస్సును పాకిస్తాన్, ఆ దేశ ఇంటెలిజెన్స్ సర్వీస్ ఐఎస్ఐ భగ్నం చేయాలని ప్రయత్నించాయి. ఈ విషయం తాజాగా బయటపడింది. ఈ అంశంపై ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. న్యూఢిల్లీలో అంతర్జాతీయ బ్రిక్స్ సదస్సు సెప్టెంబర్ 11-13 వరకు ప్రభుత్వం విజయవంతంగా నిర్వహించింది. రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ వంటి అగ్రనేతలు హాజరయ్యారు. ఈ సదస్సు ఇండియా నిర్వహించిన తీరు ప్రత్యేకంగా నిలిచింది.అయితే, ఇలాంటి సదస్సుకు ఆటంకం కలిగించాలని పాక్, ఐఎస్ఐ ప్రయత్నించాయి. జమ్మూ కాశ్మీర్ కథ్వా జిల్లాలోని హీరానగర్ సెక్టార్ నుంచి ఉగ్రవాదులను సరిహద్దుగుండా ఇండియా పంపించాలని ప్రయత్నించింది. సదస్సు సందర్భంగా దేశంలో పెద్ద ఉగ్రదాడి జరపాలని ప్రయత్నించింది. ఇందుకోసం హీరానగర్‌లోని బోబియా ప్రాంతంలో సరిహద్దు నుంచి ఇండియాలోకి చొరబడేందుకు కొన్ని స్థావరాల్ని కూడా పాక్ ఉగ్రవాదులు ఎంపిక చేసుకున్నారు. కానీ, ఈ విషయాన్ని ప్రభుత్వ భద్రతా దళాలు ముందుగానే పసిగట్టాయి. ఆయా ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టుదిట్టం చేశాయి. పాకిస్తాన్‌లోని అభ్రము చాక్, సుక్మాల్ ప్రాంతాలు.. ఇండియాలోని హీరానగర్ ప్రాంతాన్ని సరిహద్దుగా పంచుకుంటాయి. ఇది మన సరిహద్దుకు అతి దగ్గరగా ఉన్న ప్రాంతం కావడంతో ఇక్కడినుంచి ఇండియాలోకి సులభంగా చొరబడవచ్చని పాక్, ఐఎస్ఐ భావించాయి. ఈ ప్రాంతంలో చొరబాటుదారులకు రక్షణ కల్పించే అవకాశాలున్నాయి. ఈ ప్రాంతంలోనే జమ్మూ-పఠాన్‌కోట్ హైవే ఉంది. ఇక్కడినుంచి ఇండియాలోని ప్రభుత్వ భవనాలు, మిలిటరీ క్యాంపులు, సాధారణ ప్రజల్ని లక్ష్యంగా చేసుకోవాలని భావించారు. అయితే, భద్రతా బలగాల అప్రమత్తతతో పెను ఉగ్రదాడి తప్పింది.

# అభిషేక్ అదరహో

- -30 బంతుల్లోనే శతకబాదిన శర్మ
- -127 పరుగులతో భారత్ ఘన విజయం
- -3-0తో టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్
- -భారత్ 221/7, అఫ్గనిస్తాన్ 94/10




న్యూఢిల్లీ

అభిషేక్ శర్మ (108, 34 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లు) విశ్వరూపం చూపించాడు. టీ20 క్రికెట్‌లో మూడో వేగవంతమైన సెంచరీ సాధించిన అభిషేక్ శర్మ ఫిరోజ్ షా కోట్లలో అఫ్గనిస్తాన్ బౌలర్లను ఊచకోత కోశాడు. 11 సిక్స్‌లు, 9 ఫోర్లతో దండయాత్ర సాగించాడు. మరో ఓపెనర్ సంజు శాంసన్ (50, 35 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో మెరిశాడు. తొలుత భారత్ 221/7 పరుగుల భారీ స్కోరు చేయగా, ఛేదనలో అఫ్గనిస్తాన్ 94 పరుగులకే కుప్పకూలింది. నితీశ్ కుమార్ రెడ్డి (3/25), రవి బిష్ణోయ్ (3/26), అక్షర్ పటేల్ (2/9) మ్యాజిక్ చేయగా 14.1 ఓవర్లలోనే అఫ్గాన్ చేతులెత్తేసింది. అఫ్గాన్ బ్యాటర్లలో జద్రాన్ (25), అజ్మతుల్లా (17) చెప్పుకోదగిన స్కోరు చేశారు. మూడో టీ20లో 127 పరుగులతో భారీ విజయం సాధించిన భారత్ 3-0తో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది.

అభిషేక్ ఊచకోత

టాస్ నెగ్గిన అఫ్గనిస్తాన్ బౌలింగ్ ఎంచుకోగా.. అభిషేక్ శర్మ ఊచకోతకు పూనుకున్నాడు. పవర్‌ప్లేలోనే ఎడాపెడా బౌండరీలు బాదిన అభిషేక్ శర్మ అఫ్గాన్ బౌలర్లను ఒత్తిడిలో పడేశాడు. ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 16 బంతుల్లోనే అభిషేక్ అర్ధ సెంచరీ సాధించగా.. భారత్ తొలి ఆరు ఓవర్లలోనే 100 పరుగులు పిండుకుంది. మహ్మద్ నబి ఓవర్లో అభిషేక్ శర్మ, సంజు శాంసన్ చెరో రెండు సిక్సర్లు కొట్టి విధ్వంసక ఇన్నింగ్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లారు. అభిషేక్ శర్మ మరో ఐదు సిక్స్‌లు, నాలుగు ఫోర్లతో 30 బంతుల్లోనే సెంచరీ కొట్టాడు. టీ20 క్రికెట్‌లో ఇది మూడో వేగవంతమైన సెంచరీ కావటం విశేషం. ఓపెనర్లు తొలి వికెట్‌కు 9.5 ఓవర్లలో 142 పరుగులు జోడించారు. రెండు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో సంజు శాంసన్ సైతం 34 బంతుల్లో అర్ధ సెంచరీ సాధించాడు. ఓపెనర్లు ఇద్దరు నిష్క్రమించిన తర్వాత పరుగుల వేగం నెమ్మదించింది. తిలక్ వర్మ (2) రనౌట్ కాగా.. శ్రేయస్ అయ్యర్ (29) ధాటిగా ఆడలేకపోయాడు. శివమ్ దూబె (14), ఇషాన్ కిషన్ (10) ఎదురుదాడి చేయలేకపోయారు. ఓ దశలో 270-280 స్కోరు అంచనా వేసినా.. ఆఖరుకు 221 పరుగులకు సరిపెట్టుకోవాల్సి వచ్చింది. అఫ్గనిస్తాన్ బౌలర్లలో అజ్మతుల్లా ఓమర్‌జాయ్ (2/27) రెండు వికెట్లు పడగొట్టగా.. రషీద్ ఖాన్ (1/43), అబ్దుల్లా అహ్మద్‌జాయ్ (1/38) రాణించారు. తిలక్ వర్మతో పాటు శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లు రనౌట్‌గా వెనుదిరిగారు.

# సుస్థిరతతోనే పెట్టుబడులు!

మొదటి తరువాయి

కాశీ పుణ్యక్షేత్రం మోదీ కర్మభూమి అని.. వారాణసీకి నేతను ఎన్నుకోవడమే కాదు...దేశానికి ఓ గొప్ప నాయకుడిని అందించిందని తెలిపారు. 'వీకేఎస్ అనేది అభివృద్ధి మంత్రం.. ఈ మంత్రంతో దేశం అభివృద్ధిపథంలో దూసుకుపోతోంది.

వీ అంటే వడ్‌నగర్.. కే అంటే కాశీ.. ఎస్ అంటే సెప్టెంబరు' అని చెప్పారు. ఎన్‌డీఏ ఐక్యతే దేశానికి బలమన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం పెద్దఎత్తున సాయం అందిస్తోందన్నారు. అమరావతి, పోలవరం వంటి ప్రాజెక్టులకు ఇస్తున్న మద్దతును రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ మరువలేరని తెలిపారు. దేశంలో భిన్న సంస్కృతులు, భిన్న భాషలు ఉన్నా.. దేశాభివృద్ధి, ఆత్మనిర్భరతే మన లక్ష్యమన్నారు. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుందని స్పష్టంచేశారు.

ప్రపంచం సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ

మోదీ ప్రభుత్వ విజయాలను చంద్రబాబు వివరించారు. 25 కోట్ల మంది భారతీయులు పేదరికం నుంచి బయటపడ్డారని.. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయని చెప్పారు. 'జల్‌జీవన్ మిషన్, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఇవి అంకెలు మాత్రమే కాదు.. వీటి వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి-సంక్షేమం ఉంది. పీఎం కిసాన్ కింద 11 కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు. ఇందులో ఎలాంటి మధ్యవర్తులూ లేరు. నేరుగా రైతుల ఖాతాలకే నగదు జమ చేస్తున్నారు' అని తెలిపారు.




ప్రపంచంలో వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ నరేంద్ర మోదీ దేశానికి మంచి నాయకత్వం అందించారని.. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ విధానాలతో మేకిన్ ఇండియా కానట?ప్టను బలోపేతం చేశారని ప్రశంసించారు. 'గతంలో రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునేవాళ్లం, ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని మోదీయే. మహిళా సంక్షేమం, సాధికారత కోసం ఆయన కృషి అపూర్వం.. బేటీ బచావో-బేటీ పడావో, లఖ్‌పతి దీదీ స్కీంలు ఇందుకు నిదర్శనం. ఉజ్వల పథకం ద్వారా క్లీన్ ఫ్యూయల్‌ను ప్రోత్సహిస్తున్నారు. ముద్ర పథకం పెట్టుబడులు సమకూరుస్తోంది. స్వయం సహాయక సంఘాలు నమ్మకాన్ని పెంచుతున్నాయి. నారీశక్తి అధినియం ద్వారా చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు ఇవ్వబోతున్నారు. ఇది గేమ్ చేంజర్ కాబోతోంది' అని చెప్పారు.

## రష్యా చమురు కొనుగోళ్లపై అమెరికా హెచ్చరిక

**న్యూఢిల్లీ,**




రష్యా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తున్న భారత్, చైనాలకు అమెరికా హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే 100 శాతం వరకు టారిఫ్‌లు విధించే అవకాశం ఉందని తెలిపింది. ఇందుకు సంబంధించిన బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. అయితే భారత్ తన ఇంధన భద్రతే ప్రాధాన్యమని స్పష్టం చేసింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధనం కొనుగోలు చేస్తామని, దేశ వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని కేంద్రం వెల్లడించింది.

# ఎల్‌నినోపై ముందస్తు చర్యలేవీ?

మొదటి తరువాయి

చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. 688 మండలాలకు గాను 628 మండలాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని.. అయినా ఇంతవరకు కరువు మండలాలను ఎందుకు ప్రకటించలేదని ప్రశ్నించారు. శ్రీశైలం డ్యాం నుంచి పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు సరైన సమయంలో నీరివ్వలేదన్నారు. పోలవరం ప్రాజెక్టు సామర్థ్యంపై కూటమి ప్రభుత్వం రాజీపడిందన్నారు. వాస్తవానికి ఆయన సీఎంగా ఉన్నప్పుడే 2020లో ఈ ప్రాజెక్టును 194.6 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి బదులు 41.15 మీటర్ల కాంటూరులో 119 టీఎంసీలకు కుదించారు. తొలి దశ, మలి దశ అంటూ విన్యాసాలు చేశారు.ఇలాగైతే ఈ బహుళార్థ సాధక ప్రాజెక్టు బ్యారేజీగా మారిపోతుందంటూ 'ఆంధ్రజ్యోతి' నాడు హెచ్చరించినా పట్టించుకోలేదు. ఆనాటి తెలంగాణ సీఎం కేసీఆర్‌ను కలిసినప్పుడు.. కృష్ణా, గోదావరి నదులపై అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న ప్రాజెక్టులపై నోరు మెదపలేదు. పైగా రెండు రాష్ట్రాలూ ఇచ్చిపుచ్చుకునే ధోరణితో వ్యవహరించాలంటూ జగన్ సుద్దులు చెప్పారు. కేంద్ర జలశక్తి మంత్రి అధ్యక్షతన జరిగిన అపెక్స్ కౌన్సిల్ సమావేశంలోనూ ఆంధ్రప్రదేశ్ హక్కుల గురించి ప్రస్తావించలేదు. ఆయన అధికారంలో ఉండగా మూడేళ్ల పాటు కరువు నెలకొంది. అయినా తానొస్తే కరువు ఉండదని.. వర్షాలు పుష్కలంగా పడతాయంటూ స్వీయ కితాబిచ్చుకున్నారు. అదే సమయంలో తాను సీఎంగా ఉన్నప్పుడు రాయలసీమలో చీనీ తోటలకు ట్యాంకర్లతో నీరు సరఫరా చేశానన్నారు. తన పాలనలో కరువు లేదంటూనే .. చీనీ తోటలకు ట్యాంకర్లతో నీళ్లిచ్చానంటూ జగన్ చెప్పడాన్ని రాజకీయ వర్గాలు ఎద్దేవా చేస్తున్నాయి. ఆయన అధికారంలో ఉండగా కరువు మండలాలను ప్రకటించేందుకే ఇష్టపడలేదని గుర్తుచేస్తున్నాయి. పోతిరెడ్డిపాడు ద్వారా రాయలసీమకు తాగునీటి కోసం నీరు విడుదల చేస్తున్నా అబద్ధమాడుతున్నారని ఆక్షేపిస్తున్నాయి.

# ఇకపై మెడికల్ షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి!




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 17 : ఇకపై మందుల దుకాణాల్లో సీసీటీవీ నిఘాను తప్పనిసరి చేసేందుకు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రతిపాదిస్తున్నది. నిర్దేశిత హెచ్, హెచ్1, ఎక్స్ క్యాటగిరీ ఔషధాల అమ్మకాలపై నిఘా కోసం ఈ చర్య చేపట్టనుంది. విస్తృతశ్రేణి ప్రిస్క్రిప్షన్ మందులు (వైద్యుల సూచనలతో వాడే మందులు)ను హెచ్ శ్రేణిగా, అదనపు పర్యవేక్షణ, రికార్డుల నిర్వహణ అవసరమయ్యే కొన్ని నిర్దిష్ట మందులను హెచ్1లోకి, అత్యంత కఠినమైన నియంత్రణలు కలిగిన మందులను ఎక్స్ శ్రేణిగా పరిగణిస్తారు.ఈ మూడు శ్రేణులకు చెందిన ఔషధాల అమ్మకాలు, పంపిణీని నియంత్రించడానికి, సరైన వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మకాలు నిరోధించడానికి, రిటైల్ దుకాణ అమ్మకాల్లో పారదర్శకత, బాధ్యత పెంచడానికి, ఔషధ సరఫరా చైన్‌ను నియంత్రించడానికి ఈ చర్యలను ప్రతిపాదిస్తున్నారు. దీనిపై సలహాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించి నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది.

# తెలంగాణకు భారీ వర్ష సూచన

మొదటి తరువాయి

వర్షాలు పడతాయని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో దాదాపు అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఐఎండీ హెచ్చరికల ప్రకారం.. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, హైదరాబాద్, జగిత్యాల, భూపాలపల్లి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్-మల్కాజిగిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్ సహా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయి. రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం వరకు ఈదురుగాలులు, ఉరుములతో కూడిన జల్లులు కురుస్తాయని అధికారులు తెలిపారు. వాతావరణ నిపుణుడు టి.బాలాజీ సైతం తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా సెప్టెంబర్ 17, 18 తేదీల్లో రాత్రి, తెల్లవారుజామున తీవ్రమైన ఉరుములతో కూడిన వర్షాలు పడతాయని అంచనా వేశారు. నగరంలో రాత్రిపూట మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నైరుతి రుతుపవనాల సీజన్లో రాష్ట్రంలో వర్షపాతం లోటు కొనసాగుతోంది. ఇప్పటివరకు తెలంగాణలో సాధారణంగా 664.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 536.5 మిల్లీమీటర్లు మాత్రమే కురిసింది. ఇది 19 శాతం లోటును సూచిస్తోంది. ముఖ్యంగా హనుమకొండ జిల్లాలో అత్యధికంగా 42 శాతం వర్షపాతం తక్కువగా నమోదైంది. హైదరాబాద్‌లోనూ సాధారణ వర్షపాతం 550.8 మి.మీ. కాగా, ఇప్పటికి 432 మి.మీ. మాత్రమే కురిసింది. రానున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రయాణాలు చేసేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

# బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో తాళ్లరేవులో హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై అవగాహన

**తాళ్ళరేవు, సెప్టెంబర్ 17, ( నేటి దర్శిని )**
హెచ్ఐవీ మరియు ఎయిడ్స్‌పై ర్యాలీ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా తాళ్ళరేవు గ్రామంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దిశా,బీమాభాయి మహిళా మండలి సహకారంతో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య అంశాలపై మరియు హెచ్ ఐ వి ఎయిడ్స్ పై అవగాహనా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది, ఎలా సంక్రమించదు, హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పట్ల గల అపోహలు, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదనే అంశాలపై



అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ మరియు ఎయిడ్స్‌కు సంబంధించిన ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే 1097 టోల్‌ఫ్రీ నంబర్, హెచ్ఐవీ మరియు ఎయిడ్స్ చట్టం 2017, ఏఆర్‌టీ మందుల కేంద్రాలు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఐఈసీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన, ప్రోగ్రాం డాక్యుమెంటేషన్ కోఆర్డినేటర్ పి ఎస్ ఆర్ కనకాంబరం,హెల్త్ ప్రోగ్రాం ఆర్గనైజర్ జి చంద్రకళ,కమ్యూనిటీ ఆర్గనైజర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


## బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో తాళ్లరేవులో హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పై అవగాహన

**తాళ్ళరేవు, సెప్టెంబర్ 17, ( నేటి దర్శిని )**
హెచ్ఐవీ మరియు ఎయిడ్స్‌పై ర్యాలీ కార్యక్రమాన్ని కాకినాడ జిల్లా తాళ్ళరేవు గ్రామంలో బీమాబాయి మహిళా మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సూచనలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. దిశా,బీమాభాయి మహిళా మండలి సహకారంతో ఇంటెన్సిఫైడ్ ఐఈసీ క్యాంపెయిన్ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య అంశాలపై మరియు హెచ్ ఐ వి ఎయిడ్స్ పై అవగాహనా కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ ఎలా సంక్రమిస్తుంది, ఎలా సంక్రమించదు, హెచ్ఐవి మరియు ఎయిడ్స్ పట్ల గల అపోహలు, హెచ్ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, హెచ్ఐవీ బాధితుల పట్ల వివక్షత చూపకూడదనే అంశాలపై అవగాహన కల్పించారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో హెచ్ఐవీ మరియు






ఎయిడ్స్‌కు సంబంధించిన ఉచిత సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే 1097 టోల్‌ఫ్రీ నంబర్, హెచ్ఐవీ మరియు ఎయిడ్స్ చట్టం 2017, ఏఆర్‌టీ మందుల కేంద్రాలు తదితర అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలకు ఐఈసీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీమాబాయి మహిళా మండలి ప్రాజెక్ట్ డైరెక్టర్ వాసంశెట్టి నందివర్ధన, ప్రోగ్రాం డాక్యుమెంటేషన్ కోఆర్డినేటర్ పి ఎస్ ఆర్ కనకాంబరం,హెల్త్ ప్రోగ్రాం ఆర్గనైజర్ జి చంద్రకళ,కమ్యూనిటీ ఆర్గనైజర్లు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.


# రాష్ట్రంలో తీవ్ర కరవుపై ముందస్తు చర్యలు శూన్యం..

**- కూటమి ప్రభుత్వంపై జగన్ ధ్వజం**

**-రాష్ట్రంలో కరవు పరిస్థితులపై జగన్ ఆందోళన**

**-ఈ ఖరీఫ్‌లో సాగు 56.4 లక్షల ఎకరాలకే పరిమితమయిందన్న జగన్**

**-రైతులను నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్**



**తాడేపల్లి,సెప్టెంబర్ 17, ( నేటి దర్శిని**
ఆంధ్రప్రదేశ్‌లో తీవ్రమవుతున్న కరవు, వర్షాభావ పరిస్థితులపై వైసీపీ అధినేత జగన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి రీజనల్ కో-ఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన జిల్లాల వారీగా పరిస్థితులపై సమీక్ష జరిపారు. ఖరీఫ్ ప్రారంభం నుంచి సెప్టెంబర్ 16 వరకు రాష్ట్రంలో 51 శాతానికి పైగా వర్షపాతం లోటు నమోదైందని, మొత్తం 688 మండలాల్లో 628 మండలాలు తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సందర్భంగా తెలిపారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా కూటమి ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు.
76 లక్షల ఎకరాల్లో సాగుకు.. కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన
ఖరీఫ్‌లో సాధారణంగా 76 లక్షల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉండగా కేవలం 56.4 లక్షల ఎకరాలకే పరిమితమైందని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. విత్తనం వేయలేకపోయిన రైతులకు ఎకరాకు రూ.15,000, పంట దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25,000 చొప్పున ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు ఉచిత పంటల బీమాను పునరుద్ధరించి పాత బకాయిలైన రూ.3,000 కోట్లను విడుదల చేయాలన్నారు. ఒక్కో రైతుకు అన్నదాత సుఖీభవ కింద పెండింగ్‌లో ఉన్న రూ.41,000 చెల్లించాలని సూచించారు. ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.6,000 కోట్లు అందించాలన్నారు. రాయలసీమ ప్రాజెక్టులకు నీటిని తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు.
లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శసాగునీటి రంగంలో ప్రభుత్వం అవలంబిస్తున్న తీరును తప్పుబడుతూ, పోలవరం నిల్వ సామర్థ్యంపై రాజీపడుతూ ఉనికి కోసం లిఫ్ట్ ప్రాజెక్టులతో డ్రామాలు ఆడుతున్నారని జగన్ విమర్శించారు. కరవు బారిన పడిన గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అదనంగా 150 రోజుల ఉపాధి హామీ పనులు కల్పించాలని, తాగునీటి ఎద్దడి నివారణకు ఉచిత ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వైసీపీ క్షేత్రస్థాయి కార్యాచరణ చేపడుతుందని, త్వరలోనే తాను స్వయంగా కరవు ప్రాంతాల్లో పర్యటించి రైతులకు అండగా నిలుస్తానని స్పష్టం చేశారు

# తెలంగాణ చరిత్ర మరువని రోజు సెప్టెంబర్ 17: ఆర్జీత్రీ జిఎం



**రామగిరిసెప్టెంబర్ 17, ( నేటి దర్శిని**
తెలంగాణ చరిత్రలో మరువని రోజు ఈ సెప్టెంబర్ 17 అని రామగుండం-3 జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు. గురువారం తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా జిఎం కార్యాలయం నందు నిర్వహించిన వేడుకల్లో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో మరువలేని రోజు 17 సెప్టెంబర్ 1948, అది నిజాం నిరంకుశత్వం తలవంచిన, రజాకార్ల ఆగడాలు అంతమైన రోజు అని, నాటి రెండు కోట్ల మంది తెలంగాణ ప్రజల హృదయాల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడిన పర్వదినమని, నిజాం రాచరిక పాలన ముగిసి, హైదరాబాద్ రాజ్యం భారత ప్రభుత్వంలో కలిసిన ఆరోజు వెనుక అనేక ఘటనలు, ఎందరో మహానుభావుల త్యాగాలు, పోరాటాలు మరువలేనివని అన్నారు.తెలంగాణను బంగారు తెలంగాణగా మార్చుకున్నప్పుడే పూర్వీకుల త్యాగాలకు సార్ధకత చేకూరుతుందని, సెప్టెంబర్ 17 తేదీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన దినోత్సవం గా ప్రకటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సింగరేణీయులుగా మనకు కేటాయించిన విధులను, బాధ్యతలను సక్రమంగా పాటిస్తూ మన తెలంగాణ రాష్ట్ర, దేశ పురోగతికి దోహదపడాలని అన్నారు.
కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్రరెడ్డి, కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం అధ్యక్షుడు కోల శ్రీనివాస్, ఎస్వోటుజిఎం యం.రామ్మోహన్, ఏరియా ఇంజినీర్ దూప్ సింగ్, విభాగాధిపతులు బి.సుదర్శనం, ఎస్.రవికుమార్, కె.ఐలయ్య, ఆర్.రాజేశ్వరి, ప్రశాంత్ జీవన్, ఇతర విభాగాధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



**బచ్చన్నపేట,సెప్టెంబర్ 17, ( నేటి దర్శిని**
బచ్చన్నపేట మండల కేంద్రంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వెల్దుర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశ్వకర్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ విశ్వకర్మను సృష్టికర్తగా, శిల్పకళకు ఆద్యుడిగా భావిస్తారని తెలిపారు. స్వర్ణకారులు, చేతివృత్తుల కళాకారులు విశ్వకర్మను ఆరాధ్యదైవంగా భావించి ప్రతి సంవత్సరం జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సంప్రదాయ చేతివృత్తుల పరిరక్షణతో పాటు వృత్తిదారుల సంక్షేమానికి సంఘం తరపున కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో ఉప్పరోజు నరసింహ చారి, మునగాటి కృష్ణ, వలబోజు సాంబయ్య, మండలోజు శ్రావణ్, వలబోజు సాయి, తంగళ్ళపల్లి రమేష్, వి. భాస్కర్, ధర్మచారి, ఎం. కృష్ణ, ఎం. యాదగిరి, శ్రీకాంత్ తదితర స్వర్ణకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 17 వరకు నెలరోజులపాటు స్వచ్ఛత హి సేవ 2026 కార్యక్రమాలు



**ముమ్మిడివరం, సెప్టెంబర్ 17, ( నేటి దర్శిని )**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆదేశముల ప్రకారం ప్రతీ రోజు నిర్వహించే స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా నేటి నుండి సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వ తేది వరకు నెలరోజుల పాటు జరుగుతాయని కమిషనర్ పి రవివర్మ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా నగర పంచాయతి కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో స్వచ్ఛత హీ సేవా -- 2026 స్వచ్ఛతే మన సంకల్పం, పర్యావరణ పరిరక్షణే మన బాధ్యత, స్వచ్ఛత, పరిసరాల పరిశుభ్రత, వ్యర్థాల వేర్పాటు మరియు పర్యావరణ పరిరక్షణపై విలువైన సలహాలు, సూచనలు అందించారు. ప్రజలు మీ ఇంటి నుంచే స్వచ్ఛతపై అవగాహన పెంపొందించుకుని, తమ ఇళ్లలోనూ, పరిసరాల్లోనూ తడి, పొడి మరియు ఇతర వ్యర్థాలను సరైన విధంగా వేరు చేసి అందించడం ద్వారా స్వచ్ఛమైన ముమ్మిడివరం నగర పంచాయతి నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షులు సరిపెల్ల శ్రీను రాజు , వ్యవసాయ అధికారి ఎస్.ప్రశాంతకుమార్, మేనేజర్ కె.వదన్, శానిటరీ ఇన్స్పెక్టర్ ఇంచార్జి రాజీవ్ , ఆర్.ఐ. భాస్కరరావు, సి.ఎం.ఎం. భాస్కర్, మరియు శానిటేషన్ సెక్రెటరీలు,హెల్త్ సెక్రటరీలు , సి.ఓ.దేవకిలక్ష్మి ,ఆర్.పి.లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇలా కూడా అందాలు ఆరబోయచ్చా?

# అల్లు అర్జున్ 'రాకా' నుంచి క్రేజీ అప్‌డేట్..


## ట్రెండింగ్‌లో '37'!




టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ నటిస్తున్న పాన్-ఇండియా చిత్రం 'రాకా' సినిమాకు సంబంధించి సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన చర్చ నడుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించి తాజాగా చిత్ర నిర్మాణ సంస్థ ఎక్స్ వేదికగా 37 అనే నెంబర్‌ని పోస్ట్ చేసింది. అయితే ఈ సంఖ్య వెనుక ఓ కొత్త అప్‌డేట్ రాబోతుందని తెలుస్తుంది. దీంతో నెట్టింట 37 అనే హ్యాష్‌ట్యాగ్ ట్రెండింగ్‌లోకి వచ్చింది. అసలు ఈ ట్రెండింగ్‌లో కనిపిస్తున్న '37' అనే సంఖ్య దేనికి సంబంధించినది? చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఎలాంటి సరికొత్త ప్రకటన రాబోతుంది? అంటూ అల్లు అభిమానులు తీవ్ర ఉత్కంఠతో చర్చించుకుంటున్నారు.స్టార్ డైరెక్టర్ అట్లీ దర్శకత్వంలో, సన్ పిక్చర్స్ వంటి ప్రముఖ నిర్మాణ సంస్థ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ ప్రతిష్టాత్మక సినిమాను తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ తరుణంలో మేకర్స్ ప్లాన్ చేసిన ఈ సరికొత్త సర్ప్రైజ్ అప్‌డేట్ ఏమై ఉంటుందోనని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక క్లారిటీ రానుంది.

# చిరు 'కాకా'లో స్నేహ..


## మెగాస్టార్‌కి జోడీగా?



మెగాస్టార్ చిరంజీవి, మాస్ డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'కాకా పై టాలీవుడ్‌లో రోజురోజుకూ అంచనాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించి విడుదలైన ప్రచార చిత్రాలు, గ్లింప్స్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఓ క్రేజీ రూమర్ ఫిల్మ్ సర్కిల్స్‌లో చక్కర్లు కొడుతోంది. అప్పట్లో అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించిన ప్రముఖ సీనియర్ నటి స్నేహ.. ఇప్పుడు మెగాస్టార్ సరసన నటించే గోల్డెన్ ఛాన్స్ కొట్టేసినట్లు తెలుస్తోంది.ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం, 'కాకా' చిత్రంలో స్నేహ చిరంజీవి భార్య పాత్రలో కనిపించనున్నారట. ఈ వార్త నిజమైతే కచ్చితంగా ఇది అభిమానులకు పండగలాంటి వార్తే అవుతుంది. కొన్నేళ్ల క్రితం ఒక ఇంటర్వ్యూలో స్నేహ మాట్లాడుతూ.. తన కెరీర్‌లో మెగాస్టార్ చిరంజీవితో ఒక్కసారైనా స్క్రీన్ షేర్ చేసుకోవాలని, అది తన చిరకాల కోరిక అని మనసులోని మాటను బయటపెట్టారు. ఆనాడు ఆమె పంచుకున్న కల ఇప్పుడు నెరవేరబోతుండటం విశేషం. వివాహం తర్వాత సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, సెకండ్ ఇన్నింగ్స్‌లో చాలా సెలెక్టివ్‌గా మంచి ప్రాజెక్ట్స్ మాత్రమే ఎంచుకుంటున్న స్నేహకు.. ఈ సినిమా ద్వారా తెలుగు తెరపై మరోసారి భారీ రీఎంట్రీ లభించినట్లేనని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇదిలా ఉంటే, ఈ చిత్రంలో చిరంజీవి పాత్ర చాలా డిఫరెంట్‌గా ఉండబోతోంది. ఆక్వా పరిశ్రమలో ఒక సాధారణ సూపర్‌వైజర్‌గా 'కె. సత్యం' అనే విలక్షణ పాత్రలో మెగాస్టార్ కనిపించనున్నారు. పైకి చాలా కూల్‌గా, సాధారణంగా కనిపించే ఈ పాత్ర వెనుక ఒక బలమైన ఎమోషనల్ బ్యాక్‌డ్రాప్ ఉన్నట్లు గ్లింప్స్ చూస్తే స్పష్టమవుతోంది. మరోవైపు, మలయాళ యువ నటి అనస్వరా రాజన్ ఈ చిత్రంలో అత్యంత కీలకమైన 'అమ్ములు పాప' అనే పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమా కథా గమనాన్ని మలుపు తిప్పే ఈ పాత్ర చిత్రానికే గుండెకాయ లాంటిదని ఇప్పటికే మేకర్స్ ప్రకటించడం విశేషం. ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకుని ఈ భారీ మాస్ ఎంటర్‌టైనర్‌ను 2027 జనవరి 13న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి చిత్ర బృందం సన్నాహాలు చేస్తోంది. త్వరలోనే నటి స్నేహ ఎంట్రీపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# రణబాలి' షూటింగ్ పూర్తి..

## అక్టోబర్ 16న గ్రాండ్ రిలీజ్!




టాలీవుడ్ పాన్-ఇండియా పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి' షూటింగ్ తాజాగా పూర్తిచేసుకుంది. రౌడీ హీరో విజయ్ దేవరకొండ, స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ భారీ చారిత్రాత్మక చిత్రానికి రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ అయినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది.ఇక సినిమా థియేట్రికల్ విడుదలకు సరిగ్గా 29 రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో, మేకర్స్ ప్రమోషన్ కార్యక్రమాలను మరింత వేగవంతం చేశారు. రణబాలి మరియు జయమ్మ మిమ్మల్ని థియేటర్లలో కలవడానికి సరిగ్గా 29 రోజుల్లో సిద్ధమవుతున్నారు అంటూ చిత్ర బృందం సోషల్ మీడియా వేదికగా ఒక ప్రత్యేకమైన పోస్ట్‌ను షేర్ చేసింది. ప్రేక్షకులకు ఒక అద్భుతమైన విజువల్ వండర్, అసాధారణ సినిమా అనుభూతిని పంచేందుకు కౌంట్‌డౌన్ అధికారికంగా మొదలైందని, రాబోయే అక్టోబర్ 16న దసరా పండుగ కానుకగా ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా అత్యంత వైభవంగా ప్రేక్షకుల ముందుకు రానుందని యూనిట్ వెల్లడించింది. మరోవైపు, ఇటీవల విడుదలైన 'రణబాలి' టీజర్ యూట్యూబ్‌లో నంబర్ 1 స్థానంలో ట్రెండింగ్‌లో నిలవడమే కాకుండా, సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది.



# హృదయాన్ని కదిలించిన పాట

అగ్ర కథానాయిక తమన్నా నటిస్తున్న తాజా చిత్రం 'ది వివాన్' త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇందులో ఆమె సిద్ధార్థ మల్హోత్రా సరసన నటిస్తున్నది. ఇటీవలే ట్రైలర్‌ను విడుదల చేశారు. అడవి నేపథ్యంలో మైథలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో ఛఠ్ పూజ నేపథ్యంలో చిత్రీకరించిన పాట తన కెరీర్‌లోనే ఎంతో ప్రత్యేకమని చెప్పింది తమన్నా. ఆమె మాట్లాడుతూ 'నేను ముంబయిలో పుట్టిపెరిగాను. అక్కడ జుహూ బీచ్‌లో కొన్ని వేలమంది మహిళలు ఛఠ్ పూజ చేయడం చూసేదాన్ని.అయితే ఆ సంప్రదాయం గురించి నాకు ఎలాంటి వివరాలు తెలియవు. సినిమాలో పాట చిత్రీకరిస్తున్నప్పుడు ఆ పూజ చేయడం ఎంత కష్టమో అర్థమైంది. దాదాపు 36 గంటల పాటు నీళ్లు కూడా ముట్టుకోకుండా భక్తిశ్రద్ధలతో మహిళలు ఆ పూజలో నిమగ్నమవుతారు. బీహారీ సంస్కృతిలో ఈ పూజ అందమైన భాగం. మనం ఉదయించే సూర్యుడికి నమస్కరించి పూజాదికాలు చేస్తాం. కానీ వారు అస్తమించే సూర్యుడికి కూడా అంతే ప్రాముఖ్యతనిస్తారు. ఈ పాట షూటింగ్ టైమ్‌లో భావోద్వేగాల్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలున్నాయి. ఏదో అతీతశక్తి నాలో ప్రవేశించి ఉద్వేగాన్ని కలిగించినట్లుగా అనిపించింది. నా హృదయాన్ని కదిలించిన పాట ఇది' అని తమన్నా చెప్పింది.

# 800లకు పైగా ప్రీమియర్ షోలు..

## నాని 'ది ప్యారడైజ్' మూవీకి సరికొత్త రికార్డులు!



టాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ 'ది ప్యారడైజ్' చిత్రంపై ట్రేడ్ వర్గాలతో పాటు ప్రేక్షకుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. 'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ తర్వాత దర్శకుడు శ్రీకాంత్ ఓదెల, నేచురల్ స్టార్ నాని కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సరికొత్త రికార్డులను సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా, సినిమా విడుదలకు ముందే సరికొత్త ట్రెండ్‌కు తెరలేపారు. సెప్టెంబర్ 23న తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఏకంగా 800లకు పైగా భారీ ప్రీమియర్ షోలను ప్రదర్శించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.ఇప్పటివరకు విడుదలైన ఈ సినిమా ప్రచార చిత్రాలు, టీజర్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నాయి. ఇందులో నాని ఇప్పటివరకు చూడని సరికొత్త రగ్గడ్ మరియు మాస్ లుక్‌లో కనిపించనున్నారు. సెప్టెంబర్ 24 నుంచి థియేటర్లలో 'జడల జమాన' అధికారికంగా ప్రారంభం కానుండటంతో నాని అభిమానులు, మాస్ ఆడియెన్స్ ఈ సినిమా కోసం అత్యుత్సాహంతో ఎదురుచూస్తున్నారు. ట్రెండింగ్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ ఈ చిత్రానికి అదిరిపోయే సంగీతం అందిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా అత్యంత గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు.


Published and Owned by Katta Hima Pavani Published 19-8-35A,6th Lane, Old Raja Rajeshwaripeta, Vijayawada, NTR district, Andhrapradesh-520001 Printed at Neti Darshini Publications H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505, Editor: Katta Hima Pavani, PRGI NO: APTEL/26/A5450